ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
శనివారం 12 జూలై 2025



నేడు జిల్లాకు సాంఘిక సంక్షేమశాఖ మంత్రి రాక

పార్వతీపురం, జూలై11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి శనివారం జిల్లాకు రానున్నారు. పార్వతీపురంలో జరిగే 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొను న్నారు. ఆ తర్వాత కలెక్టరేట్‌లో ఆ శాఖాధికారులతో పలు అంశాలపై సమీక్షించనున్నారు. అక్కడ నుంచి నేరుగా సీతానగరం మండలం నిడగల్లుకు చేరుకుంటారు. ఆ గ్రామంలో జరిగే తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారని పార్టీ వర్గాలు శుక్రవారం తెలిపాయి. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా నేతలు తెలిపారు.

ఎక్కడికక్కడే అక్రమ నిల్వలు!

- ఎరువుల విక్రయాలపై పర్యవేక్షణ కరువు
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కొంతమంది వ్యాపారులు
- కృత్రిమ కొరత సృష్టిస్తున్నవైనం
- దాడుల్లో పట్టుబడుతున్నా.. మారని పరిస్థితి

పార్వతీపురం, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ రైతులు ఎరువులు, విత్తనాల విషయంలో ఏ ఇబ్బంది కలగకూడదని ప్రభుత్వం పటిష్ఠ చర్యలు చేపడుతున్న సంగతి తెలిసిందే. ఈ మేరకు రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్‌ల ద్వారా రైతులకు వాటిని సరఫరా చేస్తున్నారు. అయితే ఇంకా పూర్తిస్థాయిలో ఎరువులు, విత్తనాలు జిల్లాకు రాకపోవడంతో క్షేత్రస్థాయిలో కొంతమంది వ్యాపా రులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. ఇదే అదునుగా భావించి గోడౌన్లలో అక్రమంగా నిల్వ చేస్తున్నారు. అధిక ధరలకు వాటిని రైతులకు విక్రయించి సొమ్ము చేసుకోవాలని భావిస్తున్నారు. దీనిపై సంబంధిత వ్యవసాయాధికారుల పర్యవేక్షణ కూడా కొరవడింది. విజిలెన్స్ జిల్లా అధికా రులు దాడులు నిర్వహించినప్పుడే అక్రమాలు బయట పడుతున్నాయి. కేసు నమోదుతోనే సరిపెడుతుండడంతో జిల్లాలో కొంతమంది వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఏటా రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

- జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు 45,277 మెట్రిక్ టన్నులు ఎరువులు అవసరం. అయితే ఇప్పటివరకు 19,937 మెట్రిక్ టన్నులు సరఫరా అయ్యాయి. యూరియా 21,483 మెట్రిక్ టన్నులకు గాను 8,800 మెట్రిక్ టన్నులు, డీఏపీ 8,488 మెట్రిక్ టన్నులు అవసరం కాగా 4,708 మెట్రిక్ టన్నుల వరకూ జిల్లాకు వచ్చింది. కాంప్లెక్స్ ఎరువులు 9,200 మెట్రిక్ టన్నులు అవసరం . అయితే ఇప్పటివరకు 2,697 మెట్రిక్ టన్నులే వచ్చింది. 3048 మెట్రిక్ టన్నుల పొటాష్‌కు గాను 1434 మెట్రిక్ టన్నులు, సూపర్ ఫాస్ఫేట్ 3,058 మెట్రిక్ టన్నులకు గాను ఇంతవరకు 2,298 మెట్రిక్ టన్నులు జిల్లాకు సరఫరా అయ్యాయి.
- ఈ నెలాఖరుకు 21,542 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం. ఇప్పటివరకు 19,937 మెట్రిక్ టన్నులు ఎరువులు వచ్చాయి. అందులో 12,752 మెట్రిక్ టన్నుల పంపిణీ పూర్తయ్యింది. ఇంకా 7,185 మెట్రిక్ టన్నులు ఎరువులు నిల్వలు ఉన్నాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

నమోదైన కేసులు ఇలా..

- 2020-21లో గరుగుబిల్లి మండలం గిజబా గ్రామంలో సుమారు రూ.1.40 లక్షలు విలువ చేసే 7.64 మె ట్రిక్ టన్నుల ఎరువులను అధికారులు సీజ్ చేశారు.
- 2022-23లో బలిజిపేట మండలం వంతరాంలో 14.4 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేశారు. వాటి విలువ సుమారు రూ.పది లక్షల వరకూ ఉండగా.. బాధ్యులపై 6ఏ కేసు నమోదు చేశారు.
- 2023-24లో బలిజిపేటలోని ఓ ఎరువుల దుకాణంపై అధికారులు దాడులు నిర్వహించారు. సుమారు రెండు లక్షల విలువ

(మిగతా 8వ పేజీలో...)



మక్కువ మండలం సన్యాసిరాజపురంలో అధికారులు సీజ్ చేసిన అక్రమ ఎరువు నిల్వలు

అంతంతమాత్రంగానే చర్యలు

జిల్లాలో ఏటా ఎరువుల దుకాణాలపై అధికారులు దాడులు నిర్వహించి.. కొంతమంది వ్యాపారులపై కేసులు నమోదు చేస్తున్నా.. తూతూ మంత్రంగానే చర్యలు ఉండడం వల్ల పరిస్థితి మారడం లేదు. కొన్ని దుకాణాల్లో యథావిధిగానే అక్రమాలు సాగుతున్నాయి. రైతుల అవసరా లను ఆసరాగా తీసుకుని కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. కొంతమంది వ్యాపారులు ఎరువులను అక్రమంగా నిల్వ చేసి అధిక ధరలకు విక్రయిస్తు న్నారు. తద్వారా రెట్టింపు లాభాలను ఆర్జిస్తు న్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలని రైతులు కోరుతున్నారు.



ఇటీవల శంబరలో తనిఖీలు నిర్వహించిన అధికారులు

16 నుంచి ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్

- ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు
- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



పార్వతీపురం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 16 నుంచి 30వ తేదీ వరకు ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..' పక్షోత్సవాల సందర్భంగా ప్రతి గ్రామంలో పారిశుధ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రతపై ప్రజలను చైతన్యపర్చాలి. గ్రామాల్లోని మురుగునీటి కాలువల్లో పూడికలను తీయించి.. బ్లీచింగ్ జల్లాలి. చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలించాలి. గ్రామస్థులకు సురక్షిత నీటిని అందించాలి. రక్తహీనతతో బాధపడుతున్న వారిని గుర్తించాలి. జిల్లాలో మలేరియా కేసులు నమోదు కాకుండా ముందుస్తు చర్యలు తీసుకోవాలి. ఎక్కడా నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. యాంటీ లార్వా ఆపరేషన్ తప్పనిసరిగా చేపట్టాలి.' అని తెలిపారు. మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు, వైద్యాధికారులు తప్పనిసరిగా తమ ప్రాంతంలోని పీహెచ్‌సీలను సందర్శించాలి. సమావేశంలో డీపీవో టి.కొండలరావు, డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ వచ్చిన గజరాజులు 6లో
తోటపల్లి హుండీల లెక్కింపు 6లో

ఇది ఒడిశా.. మళ్లీ రావొద్దు!

- వైద్య శిబిరం నిర్వహించొద్దు
- ఏపీ వైద్యాధికారికి ఒడిశా అధికారి అభ్యంతరం

సాలూరు రూరల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): 'ఇది ఒడిశా గ్రామం.. ఏపీ వైద్యశిబిరం ఇక్కడ నిర్వహించొద్దు.' అని తోణాం వైద్యాధికారి అక్యాన అజయ్‌కు ఒడిశా రాష్ట్రం పొట్టంగి తహసీల్దార్ దేవేంద్రసింగ్ బహదూర్ దరువా అభ్యంతరం చెప్పారు. సాలూరు మండలంలో ఉన్న ఏవోబీ వివాదస్పద కొఠియా గ్రూప్ పణికి గ్రామంలో శుక్రవారం ఏపీ 104 వాహన వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అజయ్ రోగులకు వైద్య సేవలు అందిస్తున్న సమయంలో ఒడిశా రాష్ట్రం పొట్టంగి తహసీల్దార్ దేవేంద్రసింగ్ అభ్యంతరం చెప్పారు. 'ఇది ఒడిశా గ్రామం.. ఇక్కడెలా ఏపీ వైద్యశిబిరం నిర్వహిస్తారు.' అని ప్రశ్నించారు. వైద్యశిబిరం నిలిపేసి వెళ్లిపోవాలని, లేకుంటే పోలీసులను పిలవాల్సి వస్తుందన్నారు. తమ ప్రభుత్వ షెడ్యూల్ ప్రకారం ఇక్కడకు వచ్చామని ఆయనకు వైద్యుడు అజయ్ వివరించారు. ఇరు రాష్ట్రాల్లో తమ గ్రామాలున్నందున ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా వైద్యసేవలు అందించాల్సి ఉందని తెలిపారు. దీంతో ఒడిశా అధికారి వెళ్లిపోయారు. ఆ తర్వాత ఏపీ 104 వాహన వైద్యశిబిరాన్ని గంజాయిభద్ర, కొఠియాలో నిర్వహించి 52 మందికి వైద్యసేవలందించారు.



పణికిలో ఏపీ వైద్యశిబిరానికి అభ్యంతరం చెబుతున్న ఒడిశా అధికారి

కాలువ నిర్మించరు.. పరిహారం చెల్లించరు

- పదేళ్ల కిందట రైతుల నుంచి సేకరించిన భూములు
- ఇప్పటికీ ప్రారంభంకాని 'పోలవరం' పనులు
- నష్టపరిహారం కూడా చెల్లించని వైనం
- ఇబ్బందులు పడుతున్నరైతులు



రామలింగపురం గ్రామ రెవెన్యూలో పోలవరం కాలువ కోసం సేకరించిన భూములు

కొత్తవలస, జూలై 11 (ఆంధ్రజ్యోతి): వారికి భూములు ఉన్నా అవసరాలకు అమ్ముకోలేరు. సాగు,తాగునీటి కాలువ కోసం ఆ భూములను సేకరించి పదేళ్లవుతున్నా ఇంకా వారికి నష్టపరిహారం చెల్లించడం లేదు. దీంతో ఏమీ చేయాలో తెలియక నానా అవస్థలు పడుతున్నారు. ఇదీ పోలవరం ఎడమ కాలువ నిర్మాణం కోసం భూములు కోల్పోయిన రైతుల పరిస్థితి. పోలవరం నుంచి ఉత్తరాంధ్రకు తాగు, సాగునీరును అందించడం కోసం ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకానికి పదేళ్ల కిందట అప్పటి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పోలవరం నుంచి అనకాపల్లి మీదుగా విజయనగరం, పార్వతీపురం శ్రీకాకుళం వరకు ఎడమ కాలువ నిర్మాణానికి భూములు సేకరించింది. జిల్లాకు సంబంధించి కొత్తవలస, లక్కవరపుకోట, వేపాడ, శృంగవరపుకోట మండలాల్లోని వివిధ గ్రామాల్లో భూములను సేకరించారు. ఏఏ గ్రామాల్లో ఎంత భూమి సేకరించింది సర్వే నెంబర్ల వారీగా అప్పట్లో జాబితా విడుదల చేశారు. ఒక్కొక్క రైతు సెంటు భూమి నుంచి 10 ఎకరాల వరకు కోల్పోయే పరిస్థితి వచ్చింది. సేకరించిన భూముల్లో మార్కింగ్ రాళ్లను సైతం పాతారు. ఈ ప్రక్రియ అంతా జరిగి ఇప్పటికే నాలుగేళ్లు దాటిపోయింది. కానీ, పోలవరం కాలువ పనులు మాత్రం ఇప్పటికీ ప్రారంభంకాలేదు. గత వైసీపీ ప్రభుత్వంలో నిధుల కొరత కారణంగా పనులు జరగలేదు. అలాగని, రైతులకు కూడా నష్ట పరిహారం చెల్లించడం లేదు. భూములు సేకరించి సంవత్సరాలు గడుస్తున్నా ఎకరాకు ఎంత నష్ట పరిహారం చెల్లిస్తారు? ఎప్పుడు చెల్లిస్తారనే దానిపై ఇప్పటికీ స్పష్టత రాలేదు. తమ అవసరాల కోసం భూములు అమ్ముకుందామని రైతులు ప్రయత్నాలు చేస్తున్నా కొనేందుకు ఎవరూ ముందుకు రావడంలేదు. పోలవరం కాలువలో భూమి పోతుందట కదా? ఎలా కొనుగోలు చేస్తామంటూ కొందరు వ్యాపారులు అంటుండంతో రైతులు ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంటుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పోలవరం కాలువను నిర్మిస్తారా? లేదా? అనేది స్పష్టత ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. పనులు ఆగిపోతే గతంలో జారీ చేసిన నోటిఫికేషన్ రద్దు చేయాలని, లేదంటే తమకు త్వరితగతిన నష్ట పరిహారం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



మాట్లాడుతున్న ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్

ప్రభుత్వ ఉద్యోగులు సేవలో ముందుండాలి

- ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు

6లో

అగ్నివీర్‌లవుతారా?

- ఆగస్టు 1 నుంచి ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ
- వేలాది ఉద్యోగాల భర్తీకి సన్నాహాలు
- యువతకు మంచి అవకాశం

6లో

రైలులో పోలీసుల తనిఖీలు

పాఠశాలను కొనసాగించండి

8లో

ఆలోచన టాప్ గురూ!



6లో

జంఝావతి నీరు అందట్లే!

- అధ్వానంగా కాలువలు
- ఆందోళనలో ఖరీఫ్ రైతులు
- అధికారులు స్పందించాలని విన్నపం

గరుగుబిల్లి, జూలై 11(ఆంధ్రజ్యోతి): జంఝావతి నుంచి శివారు భూములకు సాగునీరందడం లేదు. దీంతో ఖరీఫ్ రైతులు ఆందోళన చెం దుతున్నారు. వాస్తవంగా ఈ నెల 9న ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేశారు. అయినా జియ్యమ్మవలస మండలంలో భూములకు చుక్కనీరు అందని పరిస్థితి నెలకొంది. పిచ్చిమొక్కలు, పూడికలతో ప్రధాన కాలు వలన్నీ నిండిపోవడమే ఇందుకు కారణం. ప్రస్తుతం వర్షపునీటితోనే కాలు వలు దర్శనమిస్తున్నాయి. జంఝావతి ద్వారా ఐదు మండలాల్లోని 75 గ్రామాల పరిధిలో 24,640 ఎకరాలకు సాగునీరందించాల్సి ఉంది. అయితే వివిధ సమస్యలు కారణంగా 9 వేల ఎకరాలకే పరిమితయ్యారు. పూర్తి స్థాయిలో సాగునీరు సరఫరాకు 450 క్యూసెక్కులు అవసరం. అయితే పైప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి చేరడం లేదు. దీంతో ఏటా రైతులకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. దీనిపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతి నిధులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు. దీనిపై జంఝావతి ప్రాజెక్టు డీఈఈ కె.అప్పల నాయుడును వివరణ కోరగా.. రైతులకు అసౌకర్యం కలగకుండా సాగునీరు సరఫరాకు చర్యలు చేపడుతున్నాం. ఖరీఫ్‌కు సంబంధించి మొదటిగా 100 క్యూసెక్కులను విడుదల చేశాం. రెండో దఫా 200 క్యూసెక్కులను విడుదల చేస్తాం. ప్రాజెక్టు పరిధిలో ప్రధాన కాలువ 27 కిలో మీటర్లు, 21 డిస్ట్రిబ్యూటరీల పరిధిలో 15 కిలో మీటర్ల మేర ఉంది. 40 శాతం మేర పూడికతీత పనులు చేపట్టాం. ఉపాధి హామీ పథకంలో చిన్నపాటి మరమ్మతులు చేపట్టాం. కొమరాడ మండలం డంగభద్ర ప్రాంతంలోనే కొంతమేర పనులు నిర్వహించాం. ప్రధాన కాలువతో పాటు 21ఎల్ డిస్ట్రిబ్యూటరీల పరిధిలో పిచ్చి మొక్కలు, గుర్రపు డెక్క నెలకొంది. గతేడాది ఈ పరిస్థితుల్లోనే సాగునీరు విడుదల చేశాం. రైతులకు అవసరమైన అవగాహన కల్పిస్తున్నాం. రూ.54 కోట్లుతో ప్రాజెక్టు అభివృద్ధికి ప్రతిపాదనలు పంపించాం.' అని తెలిపారు.



ఉల్లిభద్ర సమీపంలో పిచ్చి మొక్కలతో నిండిన జంఝావతి కాలువ

అంకితభావంతో పనిచేయాలి

- డీఎంహెచ్‌వో భాస్కరరావు

పార్వతీపురం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఏ ప్రాంతంలోనైనా అంకిత భావంతో పనిచేయాలని డీఎంహెచ్‌వో భాస్కరరావు సూచించారు. విధి నిర్వహణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. శుక్రవారం స్థానిక డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో ఏఎన్‌ఎంలకు బదిలీల ఆదేశ పత్రాలను అందించారు. ఈనెల 10న పాఠశాలల్లో మెగా పీటీఎం నిర్వహించడం వల్ల ఆదేశాల ప్రతాలను ఇవ్వలేకపోయామన్నారు. ఇతర జిల్లాలకు స్థానచలనం పొందిన వారి స్థానంలో కొత్తవారు చేరిన తర్వాత రిలీవ్ చేయనున్నట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా జిల్లాకు కొత్త వైద్యులు వస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే కొంత మంది వచ్చి విధుల్లో చేరినట్టు చెప్పారు. అంతకముందు ప్రపంచ జనాభా దినం సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి చేపట్టిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా ఆసుపత్రి వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ తోడ్పడాలని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు వినోద్, జగన్, రఘు పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో



అగ్నివీర్‌లవుతారా?

- ఆగస్టు 1 నుంచి ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ
- వేలాది ఉద్యోగాల భర్తీకి సన్నాహాలు
- యువతకు మంచి అవకాశం

రాజాం, జూలై 11 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని నిరుద్యోగులకు శుభవార్త. రక్షణ దళాల్లో చేరి..అటు దేశానికి సేవచేసే అదృష్టంతో పాటు ఇటు ఉపాధి పొందే అవకాశం లభిస్తోంది. ఆగస్టు 1 నుంచి కాకినాడలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహించనున్నారు. అగ్నిపథ్‌లో భాగంగా ఈ ర్యాలీ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే దరఖాస్తుల ప్రక్రియ పూర్తయ్యింది. మొత్తం 22 వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. కాకినాడలోని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో 13 జిల్లాలకు సంబంధించిన అభ్యర్థులకు ఫిజికల్ ఫిట్‌నెస్, ఈవెంట్స్ పరీక్షలు జరుగనున్నాయి. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ ఆఫీస్ అసిస్టెంట్/స్టోర్‌కీపర్, టెక్నికల్, ట్రేడ్స్ మెన్ పోస్టులు భర్తీ చేయనున్నారు. రోజుకు 800 మందికి పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పోస్టులను దక్కించుకునేందుకు జిల్లాకు చెందిన అభ్యర్థులు గత కొద్ది నెలలుగా కఠోర శ్రమ పడుతున్నారు. ఫిజికల్ టెస్టులకు సంబంధించి సాధన చేస్తున్నారు. ప్రస్తుతం ఏ పట్టణం, గ్రామంలో చూసినా నిరుద్యోగ యువత ఎక్కువగా సాధన చేయడం కనిపిస్తోంది.సరైన మైదానాలు లేకపోవడంతో అభ్యర్థులు రహదారులు, ఖాళీ ప్రదేశాల్లో సాధన చేయాల్సి వస్తోంది.

● వేతనాలు ఇలా..

అగ్నివీర్ ఉద్యోగాలకు ఎంపికైతే తొలి ఏడాది నెలకు రూ.30 వేలు, రెండో ఏడాది నెలకు రూ.33 వేలు, మూడో ఏడాది రూ.36,500, నాలుగో ఏడాది నెలకు రూ.40 వేలు వేతనంగా అందిస్తారు. నాలుగేళ్లకుగా సేవానిధి ప్యాకేజీని అందిస్తారు. వార్షిక సెలవులు 30 వరకూ ఉంటాయి. ఆరోగ్య సమస్యలను బట్టి సిక్ లీవ్ ఇస్తారు. నాలుగేళ్ల పాటు సర్వీసులో ఉన్నపుడు రిస్క్ అండ్ హార్డ్‌షిప్, రేషన్, డ్రెస్, ట్రావెల్ అలవెన్స్‌లు అందిస్తారు. నాలుగేళ్ల పా టు రూ.48 లక్షలకు లైఫ్ ఇన్సూరెన్స్ కవర్ చేస్తారు. నాలు గేళ్ల సేవకుగాను వీరికి అగ్నివీర్ స్కిల్ సర్టిఫికెట్ అంది స్తారు. ఇంటర్ సమాన స్థాయి సర్టిఫికెట్ అందిస్తారు. వీరికి పింఛన్, గ్రాట్యూటీ వర్తించవు. ఎక్స్ సర్వీస్‌మెన్‌గా గుర్తించరు. కరువుభత్యం, మిలటరీ సర్వీస్ పే వీరికి వర్తించదు. ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) సైతం వీరికి ఉండ దు. నాలుగేళ్ల వ్యవధి పూర్తి చేసుకున్న అగ్నివీర్ బ్యాచ్ నుంచి 25 శాతం మందిని ఆర్మీలో రెగ్యులర్ ఉద్యోగులుగా తీసుకుంటారు. దీనికి నాలుగేళ్ల వ్యవధిలో చూపిన ప్రతిభను ప్రామాణికంగా తీసుకుంటారు. ఇలా ఎంపికైన వారు 15 ఏళ్ల పాటు ఆర్మీ సర్వీసులో కొనసాగవచ్చు.

● ఈ పరీక్షలు తప్పనిసరి..

అన్ని పోస్టులకు ఫిజికల్ టెస్టులో అర్హత సాధించడం తప్పనిసరి. అందులో భాగంగా పరుగుపందెం ఉంటుంది. 1.6 కిలోమీటర్ల దూరాన్ని 5 నిమిషాల 30 సెకెన్లలో పూర్తి చేస్తే 60 మార్కులు, 5 నిమిషాల 31 సెకెన్ల నుంచి 45 సెకన్లలోపు పూర్తి చేస్తే 48 మా ర్కులు ఇస్తారు. కనీసం ఆరు పుల్అప్స్ తీయాలి. 6 తీసిన వారికి 16 మార్కులు, 7 తీస్తే 21, ఎనిమిది పుల్‌అప్స్ తీస్తే 27, తొమ్మిదికి 33, 10 తీస్తే 40 మార్కులు పొందవచ్చు. 9 అడుగుల మేరకు లాంగ్ జంప్ వేస్తే అర్హత సాధిస్తారు. జిగ్‌జాగ్ బ్యాలెన్స్‌లో అర్హత సాధించాలి. అనంతరం ఫిజికల్ మెజర్‌మెంట్, మెడికల్ పరీక్షలు ఉంటాయి. వీటన్నింటిలో విజయవంతమైతే శిక్షణకు ఎంపిక చేస్తారు.

సేవానిధికి ఇలా జమ..

సేవానిధిలో భాగంగా ప్రతి నెలా అందుకునే మొత్తంలో 30 శాతం కార్పస్‌ఫండ్‌కి జమ చేస్తారు. మొదటి నెల పొందే రూ.30 వేల వేతనంలో రూ.9 వేలను కార్పస్ ఫండ్‌కు బదలాయిస్తారు. అగ్నివీర్‌కు కేవలం రూ.21 వేలు మాత్రమే అందుతుంది. రెండో ఏడాది వచ్చేసరికి రూ.23,100 వేతనం రూపంలో అందుతుంది. రూ.9,900 నిధికి జమ అవుతుంది. మూడో ఏడాదికి రూ.25,500 వేతనంగా అందుతుంది. రూ.10,950 నిధికి వెళుతుంది. నాలుగో ఏడాదిలో వేతనంగా రూ.28 వేలు, నిధికి రూ.12 వేలు వెళతాయి. ఇలా నాలుగేళ్లలో అగ్నివీర్ సేవా నిధికి రూ.5.02 లక్షలు పోగవుతుంది. ఇంతే మొత్తం ప్రభుత్వం జమ చేస్తుంది. ఈ లెక్కన ఈ నాలుగేళ్లలో రూ.10.04 లక్షలు అందుతాయన్న మాట. దీనికి వడ్డీ మొత్తం కలిపి అందిస్తారు. అగ్నివీర్‌లకు బ్యాంకు రుణం అందే సదుపాయాన్నీ కల్పిస్తారు.



యువతకు సువర్ణావకాశం..

నిరుద్యోగ యువతకు ఇదో సువర్ణావకాశం. దీనిని సద్వినియోగం చేసుకోవాలి. ముఖ్యంగా శారీరక దారుఢ్య పరీక్షలపై దృష్టి పెట్టాలి. ఇంకా 20 రోజుల వ్యవధి మాత్రమే ఉంది. ఉదయం, సాయంత్రం సాధన చేయడం ఉత్తమం. రాత పరీక్షకు సంబంధించి గత పరీక్ష ప్రశ్నపత్రాలను ఎప్పటికప్పుడు చూసుకోవాలి. వాటికి అనుగుణంగా సాధన చేస్తే చాలా మంచిది. అభ్యర్థులు దళారుల బారిన పడకూడదు. పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ ఉంటుంది. ఈ విషయాన్ని గుర్తించుకోవాలి.

-చీకటి రమేష్, మాజీ సైనికుడు

శాకంబరిగా వాసవీ మాత

జామి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఉన్న వాసవీమాతను శుక్రవారం శాకంబరిగా అలకంరించి... పూజలు చేశారు. ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



శాకంబరిగా దర్శనమిచ్చిన వాసవీమాత

పైడిమాంబకు స్వర్ణ పుష్పార్చన

విజయనగరం కల్చరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, సిరులతల్లి పైడిమాంబకు శుక్రవారం స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. ఆషాఢమాస శుక్రవారం కావడంతో స్వర్ణపుష్పాలతో అర్చన చేశారు. వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య జరిగిన కార్యక్రమంలో భక్తులు పైడిమాంబను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈఓ శిరీష, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



పైడిమాంబకు స్వర్ణ పుష్పాలతో అర్చించిన దృశ్యం

కనకదుర్గమ్మకు ఆషాఢం సారె

భోగాపురం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): భోగాపురం బొల్లి వీధికి చెందిన భక్తులు, ప్రజలు శుక్రవారం శ్రీకనకదుర్గమ్మవారికి ఆషాఢం సారె సమర్పించి... పూజలు చేశారు. అంతకుముందు బొల్లి వీధి నుంచి బాణసంచా పేలుళ్ల, బ్యాండుమేళాలతో అమ్మవారిని ఊరేగించారు. అమ్మవారికి తొమ్మిది రకాల మిఠాయిలు, తొమ్మిది రకాల పండ్లు, పసుపు, కుంకుమలు, చీరలు పెట్టి పూజలు చేశారు. బొల్లు గాంధీ, రౌతు వాసుదేవరావు, బొల్లు త్రినాధ్, బొల్లు మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

మళ్లీ వచ్చిన గజరాజులు

గరుగుబిల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా పరిసర మండలాల్లో సంచరించిన తొమ్మిది గజరాజుల గుంపు గురువారం రాత్రి మండలానికి తిరిగి చేరుకున్నాయి. ఇటీవల గరుగుబిల్లి, జియ్యమ్మవలస, కొమరాడ మండలాల్లో సంచరించిన గజరాజుల గుంపు అటు నుంచి సీతానగరం మండలానికి చేరుకున్నాయి. అనంతరం బలిజిపేట మండలంలోని వివిధ గ్రామాల్లో పంటలను ధ్వంసం చేశాయి. అక్కడ సరైన ఆహారం లభ్యం కాకపోవడంతో గురువారం రాత్రి బలిజిపేట మండలం పెద్దింపేట మీదుగా మండలానికి చెందిన శివ్వాం, సీమలవానివలస గ్రామాల సమీపానికి చేరుకున్నాయి. సంబంధిత అటవీ సిబ్బంది, ట్రాకర్లు ఏనుగుల గుంపును నాగూరు మీదుగా తోటపల్లి పంచాయతీ నందివానివలస, గిజబ గ్రామాల వైపు మళ్లించారు. ప్రస్తుతం గిజబ, నందివానివలసలో సంచరిస్తున్నాయి. ఖరీఫ్ సమయం కావడంతో వరి నారుమళ్లు సిద్ధం చేసుకున్నామని... ఏ సమయంలో నారుమళ్లను ధ్వంసం చేస్తాయోనని బెంగగా ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తిరిగి వెళ్లినట్లే వెళ్లి మరో పర్యాయం మండలానికి చేరుకోవడంతో భీతిల్లుతున్నారు. వ్యవసాయ పనులకు ఆటంకం కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను కోరుతున్నారు.



నందివానివలస సమీపంలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

కొండపైనే ఏనుగులు..

సీతంపేట రూరల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): కీసరజోడు పంచాయతీ పరిధిలోని వెదురువాడ గ్రామ సమీపంలో ఉన్న కొండపై ఏనుగులు సంచరిస్తున్నాయి. కొండపైన ఉన్న గిరిజనులకు చెందిన అరటి, జీడి, పనస పంటలను ధ్వంసం చేసినట్లు వెదురువాడ గ్రామానికి చెందిన రాజారావు, పాపయ్య, అప్పన్నలు ఆవేదన వ్యక్తం చేశారు. ఏనుగులను ఈ ప్రాంతం నుంచి తరలించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఏనుగులు సంచరిస్తున్న గిరిశిఖర గ్రామాల్లో నివసిస్తున్న గిరిజనులను అటవీశాఖ బీట్ అధికారి దాలినాయుడు, ట్రాకర్స్ ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు.

ప్రభుత్వ ఉద్యోగులు సేవలో ముందుండాలి

- ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్

విజయనగరం రూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు సేవల్లో ముందుండాలని..కర్తవ్యాన్ని సరిగా నిర్వర్తించాలని ఎన్‌జీఓ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు విద్యాసాగర్, డీవీ రమణలు అన్నారు. రాష్ట్రంలో ఎన్‌జీఓ అసోసియేషన్ బలోపేతానికి ప్రతి ఉద్యోగి కృషి చేయాలని కోరారు. నూతనంగా ఎన్‌జీఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన వారు శుక్రవారం జిల్లాకు వచ్చారు. వీటీ అగ్రహారం నుంచి జడ్పీ కార్యాలయం వరకూ భారీ ఎత్తున ఉద్యోగులతో ర్యాలీ నిర్వహించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి రావలసిన ప్రయోజనాలను దక్కించుకోవడానికి ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. ఉద్యోగ సంఘాల నాయకులు అసోసియేషన్ కోసం అంకితభావంతో పని చేయాలన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వంతో చర్చలు జరిపి... ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రయోజనం కల్పించే దిశగా పని చేస్తామన్నారు. పెన్షనర్ల శ్రేయస్సు కోసం కృషి చేస్తామన్నారు. ఉద్యోగుల సమస్యలను అసోసియేషన్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఉద్యోగ సంఘాల ప్రతిని ధులు బాషా, శ్రీధర్‌బాబు, సురేష్, కిషోర్, రాజ్‌గోపాల్, ప్రభూజీ, నాయుడు, అప్పలరాజు, ఆనందకుమార్, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం..

పార్వతీపురం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సమస్యలను పరిష్కరించడమే తన లక్ష్యమని ఏపీ ఎన్‌జీవో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి విద్యాసాగర్ అన్నారు. పార్వతీపురంలో ఏపీ ఎన్‌జీవో సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విద్యాసాగర్ మాట్లాడుతూ జిల్లా, తాలూకాల్లో 30 శాతం యువ నాయకత్వం ఉండాలని అన్నారు. కొత్త జిల్లాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తామని చెప్పారు. పార్వతీపురం మన్యం జిల్లా కొత్త అధ్యక్షునిగా జి.వి.ఆర్.ఎస్.కిషోర్‌ను నియమిస్తున్నట్టు ప్రకటించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు శాయశక్తులా కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం ఉద్యోగులకు బకాయి ఉన్న సుమారు రూ.27 వేల కోట్లలో ఇప్పటికే రూ.3,500 విడుదలకు కృషి చేశానన్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సమస్యలపై చర్చించనున్నట్టు చెప్పారు. ప్రతి జిల్లా కేంద్రంలో సంఘానికి సొంత భవనాలు ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్‌ను పార్వతీపురం జిల్లా నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.వి.రమణ, రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు జానీ బాషా, ఏపీఎన్‌జీవో సంఘ నాయకులు సి.హెచ్.పురుషోత్తం నాయుడు, సురేష్, సాయిరాం, శ్రీధర్, రవిశంకర్, రాజాబాబు, సంగమేశ్వరరావు, ఏపీ పీహెచ్‌సీ జిల్లా వైద్యుల సంఘ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులు అత్యంత కీలకమైనవి

- ఆర్డీవో దీప్తి ● బీఎల్‌వోలకు శిక్షణ తరగతులు ప్రారంభం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్‌డీఓ దాట్ల దీప్తి

విజయనగరం రూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధులు అత్యంత కీలకమైనవని... బాధ్యతతో కూడుకున్నవని ఆర్డీవో దాట్ల దీప్తి అన్నారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌ఓ)లకు శిక్షణ తరగతులు నగరంలోని రెవెన్యూ కల్యాణ మండపంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణ తరగతులను ఆర్‌డీఓ దాట్ల దీప్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో బీఎల్‌వోలను ఆరు బ్యాచ్‌లుగా విభజించి, తొలి బ్యాచ్‌కు శుక్రవారం నాడు శిక్షణ తరగతులు ప్రారంభించామన్నారు. ఓటరు నమోదుకు సంబంధించి ఫారాలు పంపిణీ చేయడంతో పాటు ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించాల్సి ఉంటుందన్నారు. బీఎల్‌వో యాప్ ద్వారా ఫారాలను నింపడం, కొత్త ఓటర్లను నమోదు చేయడం వంటి ప్రక్రియలు నిర్వహించాలన్నారు. విజయనగరం నియోజకవర్గం ఏఈఆర్‌ఓ ఎస్ కూర్మనాథరావు మాట్లాడుతూ విజయనగరం నియోజకవర్గంలోని బీఎల్వోలందరికీ దశలవారీగా బ్యాచ్‌లుగా విభజించి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సహాయకులు శివకుమార్, ఎన్నికల డీటీ గాంధీ, మాస్టర్ ట్రైనీలు ఉమామహేశ్వరరావు, మధుకుమార్ తదితరులు పాల్గొన్నారు.



తోటపల్లి ఆలయ హుండీలను లెక్కిస్తున్న సిబ్బంది

తోటపల్లి హుండీల లెక్కింపు

గరుగుబిల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): చిన తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన తోటపల్లి శ్రీ వేంకటేశ్వర, కోదండరామస్వామి దేవస్థానాల పరిధిలో శుక్రవారం హుండీలను లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ మాట్లాడుతూ ఈ ఏడాది మార్చి నుంచి 106 రోజులకు సంబంధించి భక్తుల నుంచి కానుకల రూపంలో రూ. 5,17,488, కోదండరామ స్వామి దేవస్థానానికి రూ.7,277 వచ్చాయన్నారు. దాతల సహకారంతో ఆలయంలో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. తోటపల్లికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ లెక్కింపులో సాలూరు గ్రూపు దేవాలయాల అధికారి టి.రమేష్, సిబ్బంది ఎం.నూకం నాయుడు, బలరామస్వామినాయుడు, జి.శ్రీధర్, అర్చకులు వీవీ అప్పలాచార్యులు, విశ్రాంత రెవెన్యూ అధికారి ఎం.వాసుదేవరావు, ఆలయ అభివృద్ధి సేవా ట్రస్ట్ సభ్యులు, సేవకులు పాల్గొన్నారు.

బతుకు దుర్భరం.. ఎవరికీ చెప్పలేని దైన్యం

- ఇదీ అనాథ వృద్ధురాలి దుస్థితి



అనాథ మహిళ

విజయనగరం టౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): 'దారి పక్క, చెట్టు కింద... ఆరిన కుంపటి విధాన' అన్న మహాకవి మాటలు ఆ మహిళ దుస్థితికి దర్పణం పడతాయి. ఓవైపు అనారోగ్యం... శరీరంపై రోజుల తరబడి మానని గాయంతో ఆ వృద్ధురాలు నరకయాతన అనుభవిస్తోంది. తను ఎవరో...ఎక్కడి నుంచి వచ్చిందో చెప్పలేకపోతోంది. ఆమె దుస్థితి చూసి అయ్యో అని జాలిపడేవారే తప్ప... ఆదుకునే వారు కనిపించడం లేదు. నగరంలోని కలెక్టరేట్‌కు సమీపంలో దండుమారమ్మ ఆలయానికి వెళ్లే రహదారి పక్కన కదల్లేని స్థితిలో ఉంది. చుట్టుపక్కల అనేక ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నా.. ప్రతి నిత్యం ఈ రహదారి మీదుగా వందలాది మంది రాకపోకలు సాగిస్తున్నా... ఆ వృద్ధురాలిని ఆదుకునే ప్రయత్నం చేయడం లేదు. కనీసం స్వచ్ఛంద సంస్థలకైనా సమాచారం ఇచ్చేందుకు ముందుకు రావడం లేదు. ఆ పక్కనే ఉన్న కొంతమంది ఆర్‌డబ్ల్యూఎస్ ఉద్యోగులు మానవత్వంతో ఆహారం అందిస్తున్నారు. ఎండకూ వానకూ తడుస్తూ రోడ్డు పక్కన ఉన్న ఆమెను ఆదుకోవడానికి మానవతా దృక్పథంతో ఎవరైనా ముందుకు రావాలని స్థానికులు కోరుతున్నారు.

ఆలోచన టాప్ గురూ!

అతనో చిరువ్యాపారి. ఓ చిన్న మోపెడ్‌పై గ్రామగ్రామాన తిరుగుతూ...రబ్బర్లు, పిన్నులు, చిన్నపాటి ప్లాస్టిక్ వస్తువులు విక్రయిస్తుంటాడు. అవి అమ్ముకోకపోతే పూట గడవని పరిస్థితి. కానీ తీవ్రమైన ఎండలు ఉన్నపుడు... వర్షాలు కురిసినపుడు మోపెడ్‌పై తిరిగి వీటిని అమ్ముకోవడం కష్టంగా ఉంటోంది. అలాగని అమ్ముకోకుండా ఉండలేని పరిస్థితి. దీంతో ఎండావానల నుంచి రక్షణకు ఏం చేస్తే బాగుంటుందా అని ఆలోచించాడు. వాహనంపై ఇనుప రేకుతో ఓ టాప్‌ను ఏర్పాటు చేశాడు. అంతేకాదండోయ్... ఆ టాప్‌పైన చిన్న రింగుల్లా ఏర్పాటు చేసి... వాటికి తాను విక్రయించే వస్తువులు వేలాడదీసేందుకు వీలుగా చేశాడు. దీంతో అటు ఎండావానల నుంచి రక్షణతో పాటు... ఇటు సామగ్రి ప్రజలకు కనిపించేలా ప్రదర్శించడానికి వీలు కలుగుతోంది. ఈ కొత్త తరహా టాప్‌ను ప్రజలు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

-సాలూరు రూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి)



మోపెడ్‌పై ఉన్న టాప్

ఎరువుల విక్రయాలు సక్రమంగా చేపట్టాలి

కొత్తవలస, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఎరువులు, పురుగుల మందులు, విత్తనాలను ఇష్టానుసారంగా విక్రయిస్తే చర్యలు తప్పవని కొత్తవలస వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ ఏడీ భానులత అన్నారు. శుక్రవారం కొత్తవలసలోని ఏడీ కార్యాలయంలో ఏవో రాంప్రసాద్‌తో కలిసి ఆమె విలేకర్ల సమావేశం నిర్వహించారు. తన పరిధిలో ఎరువుల డీలర్లు స్టాక్ రిజష్టర్లను సక్రమంగా నిర్వహించాలని ఆమె ఆదేశించారు. ఇటీవల కొత్తవలసలోని మోద బాంబ ఆగ్రో ఏజెన్సీపై 6ఏ కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

● చీపురుపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏవో ఎస్ఎస్ సూర్యకుమారి హెచ్చరించారు. శుక్రవారం ఆమె పట్టణంలోని ఎరువుల దుకాణాల్ని తనిఖీ చేశారు. ఆమె వెంట వ్యవసాయ శాఖ సిబ్బంది ఉన్నారు.

గెస్ట్ లెక్చరర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు

శృంగవరపుకోట, జూలై 11(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి తెలిపారు. గణితం, జీఎఫ్‌సీ ఆధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. అర్హత ఈనెల 15వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు కళాశాలలో దరఖాస్తులు అందించాలని చెప్పారు. 16న దరఖాస్తుల పరిశీలన, 17న ఉదయం 11గంటలకు విజయనగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు.

● దత్తిరాజేరు: మరడాం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కె.సతీష్ తెలిపారు. ఫిజిక్స్, మ్యాథ్స్ సబ్జెక్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఈనెల 15వ తేదీ లోగా దరఖాస్తులు అందజేయాలని కోరారు.

సమన్వయంతో వ్యవహరించాలి

సంతకవిటి, జూలై 11(ఆంధ్రజ్యోతి): అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని చీపురుపల్లి డివిజన్ డీఎల్‌డీవో ఎ.హేమసుందర్ అన్నారు. శుక్రవారం సంతకవిటి మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లతో ఈ ఏడాది పంచాయతీల అభివృద్ధిపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందాల్సిన వసతులను గుర్తించి, ప్రణాళికలను వేసుకోవాలన్నారు. ఎంపీడీవో కె.సురేష్‌కుమార్, డిప్యూటీ ఎంపీడీవో శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

బాధ్యతగా పని చేయాలి

రాజాం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): బీఎల్వోలు బాధ్యతగా పనిచేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి టి.సవరమ్మ ఆదేశించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి బీఎల్వోలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఓటర్ల సవరణ, జాబితా తయారీ తదితర అంశాలపై బీఎల్వోలకు వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.రాజశేఖర్, రేగిడి తహసీల్దార్ ఐ.కృష్ణలత, డీటీ ప్రకాష్, ఎన్నికల డీటీ కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి మంత్రి పరామర్శ

జామి, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వెన్నె మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు బోదంకి సన్యాసినాయుడును మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శుక్రవారం కలిసి, పరామర్శించారు. పార్టీ అన్నివేళల్లో అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు.

అంగన్‌వాడీ కార్యకర్తకు మెమో

భోగాపురం, జూలై 11(ఆంధ్రజ్యోతి): ముంజేరు పంచాయతీ జగ్గయ్యపేట అంగన్‌వాడీ కార్యకర్త గంద్రేటి మంగకు మెమో అందచేసినట్టు భోగాపురం ఐసీడీఎస్ సీడీపీవో లావణ్య శుక్రవారం తెలిపారు. ఇటీవల మంగపై అందిన ఫిర్యాదు మేరకు ఐసీడీఎస్ అధికారులు మూడు సార్లు విచారణ జరిపారు. లబ్ధిదారుల పట్ల మర్యాద పూర్వకంగా ఉండాలని సూచించారు. మెమో అందజేసినట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

విజయనగరం దాసన్నపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన బాక్సింగ్ సబ్ జూనియర్స్ బాయ్స్, గర్ల్స్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ క్రీడలకు ఎంపికయ్యారు. విశాఖపట్టణం రైల్వే గ్రౌండ్‌లో జరగనున్న ఈ రాష్ట్ర స్థాయి పోటీలకు పి.యామిని, బి.హర్షిత, కె.అక్షయ, కె.బాహ్యశ్రీ, ఓ.జ్యోత్స్న, ఎ.సిరి, ఒ.రాకేష్, డి.నవీన్‌కుమార్, ఎన్.చైతన్య, వి.చైతన్య, ఎస్.చరణ్, ఎండీ అమన్, కె.రోహిత్, డి.ప్రణీత్‌లు ఈ పోటీల్లో పాల్గొనున్నారు. ఎంపికైన క్రీడాకారులను అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు అవనాపు భార్గవి అభినందించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

భోగాపురం, జూలై 11(ఆంధ్రజ్యోతి): తమ దృష్టికి వచ్చిన వినతులు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. శుక్రవారం పోలిపల్లి గ్రామంలోని తన స్వగృహంలో ఆయన 'కార్యకర్తే అధినేత' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అర్జీదారుల నుంచి వినతులు సేకరించారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎరువులు దొరకక ఇబ్బందులు

జామి, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు యూరియా, డీఏపీ వంటి ఎరువులు దొరకక చాలా ఇబ్బందులు పడుతున్నారని మాజీ జడ్పీటీసీ బండారు పెదబాబు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన జిల్లా వ్యవసాయ శాఖాధికారిని కలిసి, వినతిపత్రం అందజేశారు. ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాలని కోరారు. దీనిపై వ్యవసాయ అధికారి స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కూటమితోనే అభివృద్ధి

● గ్రామాల్లో 'సుపరిపాలనలో తొలి అడుగు'

● ప్రభుత్వ పథకాలపై ప్రజలకు వివరించిన ఎమ్మెల్యేలు



విజయనగరం రూరల్: మాట్లాడుతున్న టీడీపీ నేత అశోక్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు



మెరకముడిదాం: పులిగుమ్మిలో ఎమ్మెల్యే కళా వెంకటరావు

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యేలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం విజయనగరం జిల్లాలోని పలు గ్రామాల్లో వారు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించి, ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు.

● వేపాడ, జూలై 11(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బానాది గ్రామంలో టీడీపీ అభ్యర్థులను గెలిపిస్తే గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి హామీ ఇచ్చారు. బానాది గ్రామంలో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు గొంప వెంకటరావు, ఎంపీటీసీ సభ్యురాలు గొంప తులసి, రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి లక్ష్మి నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గుమ్మడి భారతి, బల్లంకి మాజీ సర్పంచ్ గొర్లె నాగరాజు, వైస్ సర్పంచ్ పిల్లి ధనంజయ్ పాల్గొన్నారు.

● మెరకముడిదాం: టీడీపీతోనే సుపరిపాలన సాధ్యమని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. పులిగుమ్మి గ్రామంలో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యాలయంలో ఆయన పాల్గొన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు తాటి సన్యాసినాయుడు, మాజీ ఎంపీపీ కోట్ల మోతీలాల్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

● నెల్లిమర్ల: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన సాధ్యమని ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్, టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, విశాఖ ఉత్తర నియోజకవర్గం పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్ అన్నారు. సతివాడ గ్రామంలో గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్, పార్లమెంట్ అధికార ప్రతినిధి గేదెల రాజారావు పాల్గొన్నారు. దనానపేటలో సువ్వాడ రవిశేఖర్ పాల్గొన్నారు.

● విజయనగరం రూరల్: విజయనగరంలోని 5, 6, 7 డివిజన్లలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. పీవీజీ రాజు నవాబుపేట జంక్షన్‌లో నిర్వహించిన కార్యక్రమానికి టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతిరాజు హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వానికి అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కనకమహాలక్ష్మి, మాజీ కౌన్సిలరు రౌతు పద్మావతి, టీడీపీ నగర అధ్యక్షుడు ప్రసాదుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● గరివిడి: దేవాడ, కోడూరు, దుమ్మెద గ్రామాల్లో శుక్రవారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.



వేపాడ: కరపత్రాలు ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి



నెల్లిమర్ల: పెదబూరాడపేటలో బంగార్రాజు ప్రచారం



గరివిడి: కరపత్రాలు పంపిణీ చేస్తున్న రామ్‌మల్లిక్‌నాయుడు

మొక్కలతోనే మానవ మనుగడ

● డీసీసీబీ చైర్మన్ నాగార్జున

విజయనగరం రూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. శుక్రవారం స్థానిక డీసీసీబీ కార్యాలయంలో ఇంటర్నేషనల్ కోఆపరేటివ్ సంవత్సరం సందర్భంగా ఆయన గ్రీనరీ వాల్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీడీఎం నాగార్జున, జిల్లా సహకార అభివృద్ధి అధికారి పి.రమేష్, సీఈవో ఉమామహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి

జిల్లాలోని సహకార సంఘాలు బలోపేతానికి కృషి చేయాలని డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. శుక్రవారం స్థానిక డీసీసీబీ కార్యాలయంలో పర్సన్ ఇన్‌చార్జుల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు, సంఘాలు ఆర్థికపరమైన అవకతవకలకు ఎటువంటి తావు లేకుండా భద్రత పరిమాణాలను మరింత పటిష్ఠంచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీవో పి.రమేష్, సీఈవో ఉమామహేశ్వరరావు, డీడీఎం నాగార్జున, అప్కాబ్ డీజీఎం అప్సర్ జహన్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగార్జున

నిరుపేదలకు ఉచిత న్యాయ సహాయం

గజపతినగరం, జూలై 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ న్యాయవాదుల ద్వారా ఆర్థిక స్థోమతలేని నిరుపేదలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నామని న్యాయాధికారి ఎ.విజయ్‌రాజ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక కోర్టు ఆవరణలో ఆయన న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. న్యాయవాదులు పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగ సన్మానానికి తరలిరండి

విజయనగరం రింగరోడ్డు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా తాడేపల్లిలోని సీఎస్సార్ కల్యాణ మండపంలో ఈనెల 12న ఎస్సీ, ఎస్టీ గజిటేడ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగకు జరిగే ఆత్మీయ సన్మానికి అందరూ తరలిరావాలని ఎంఈఎఫ్ జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పెంకి ఇశ్రాయిల్, ఎందవ పైడితల్లిలు కోరారు. శుక్రవారం స్థానిక సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ గజిటేడ్ అధికారులు, ఎంఈవో జాతీయ, రాష్ట్ర, జిల్లా మండల స్థాయి నాయకులు ఉద్యోగులు అందరూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. రవికుమార్, ప్రభాకరరావు, రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రధాన జంక్షన్లలో ఫ్రీ లెఫ్ట్‌కి ప్రత్యేక చర్యలు

విజయనగరం క్రైం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రధాన జంక్షన్‌లు అంబేడ్కర్, మయూరి, ఐస్‌ఫ్యాక్టరీ జంక్షన్, కలెక్టరేట్ జంక్షన్, దాసన్నపేట రైతు బజారు జంక్షన్ ప్రాంతాల్లో ఫ్రీ లెఫ్ట్‌పై ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలతో ట్రాఫిక్ సీఐ సూరినాయుడు, ఎస్‌ఐలు, సిబ్బంది ఈ జంక్షన్లలో బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనదారులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. సీఐ మాట్లాడుతూ నగరంలోని అన్ని ప్రధాన కూడళ్లలో శాశ్వతంగా ఫ్రీ లెఫ్ట్‌లు అమలయ్యే విధంగా చర్యలు చేపట్టామని, వాహనదారులు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని కోరారు. ఎస్‌ఐ భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కంపెనీలు ఏవీ?

నెల్లిమర్ల, జూలై 11(ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో నియోజకవర్గ వ్యాప్తంగా వంద కంపెనీలు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే నాగమాధవి హామీ ఇచ్చారని, ఆ కంపెనీలు ఎక్కడని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బడ్డుకొండ అప్పలనాయుడు ప్రశ్నించారు. ఒమ్మి, మల్యాడ, సతివాడ, తమ్మాపురం, తంగుడుబిల్లి గ్రామాల్లో ఆయన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు తీసుకోవాల్సిందే..

చీపురుపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు నిర్వహించాలనుకున్న వారు తప్పనిసరిగా పోలీసుల అనుమతులు తీసుకోవాలని డీఎస్పీ ఎస్.రాఘవులు అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సమూహాలు, వ్యక్తులు, సంస్థలు సమావేశాలు, ధర్నాలు నిర్వహించాలనుకున్నప్పుడు విధిగా పోలీసుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. లేకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. సీఐ జి.శంకరరావు పాల్గొన్నారు.

ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం

విజయనగరం రింగురోడ్డు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద వున్న కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ టి.భానుమూర్తిలు జెండాను ఆవిష్కరించి కార్మికులు అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. యూనియన్ ప్రతినిధులు జి.రవికుమార్, సీఐ శ్రీనివాసరావు, సీహెచ్‌వీ పట్నాయక్, ఎ.అశోక్ పాల్గొన్నారు.

బకాయి జీతాలు చెల్లించండి

● పారిశుధ్య కార్మికుల నిరసన

గరివిడి, జూలై 11(ఆంధ్రజ్యోతి): గరివిడిలోని కొండపాలెం మేజరు పంచాయతీ పారిశుధ్య కార్మికులకు గత 8నెలలుగా ఉన్న బకాయి జీతాలను చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కొండపాలెం మేజరు పంచాయతీ కార్యాలయం ఎదురుగా సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా సీఐటీయూ కార్మిక సంఘ ప్రతినిధులు అంబల్ల గౌరునాయుడు, ఎ.విశ్వనాథరాజు తదితరులు మాట్లాడారు. పారిశుధ్య కార్మికుల జీతాలను సకాలంలో చెల్లించాలని, వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ప్రతిఏటా డిపాజిట్‌గా స్వీకరిస్తున్న రూ.10వేలను గత కొన్నేళ్లుగా తిరిగి చెల్లించడం లేదన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

భోగాపురం, జూలై 11(ఆంధ్రజ్యోతి): ముంజేరులోని జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే లోకం నాగమాధవి శుక్రవారం పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. నెల్లిమర్ల, పూసపాటిరేగ, డెంకాడ మండలాలకు చెందిన ఆరు కుటుంబాలకు రూ.4లక్షల 28వేల 213 విలువ గల చెక్కులను అందజేశారు.

● చీపురుపల్లి: అనారోగ్యంతో బాధపడుతున్న కొత్తపేటకు చెందిన గవర ఎల్లమ్మ అనే మహిళకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.25వేల చెక్కును టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్‌నాయుడు శుక్రవారం అందజేశారు. శుక్రవారం చీపురుపల్లిలోని టీడీపీ కార్యాలయంలో ఆయన ఆ చెక్కును బాధితురాలికి అందజేశారు. రావివలస సర్పంచ్ పనస జానకిరామమణికంఠ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల పరిశుభ్రతే ప్రజా ఆరోగ్యానికి రక్ష

డెంకాడ, జూలై 11(ఆంధ్రజ్యోతి): గ్రామాల పరిశుభ్రతే ప్రజా ఆరోగ్యానికి రక్ష అని డీపీవో మల్లికార్జునరావు తెలిపారు. చింతలవలస గ్రామం లో శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మురుగు కాలువలు, తాగునీటి కొళాయిలను, తాగు నీటి ట్యాంకులను సందర్శించారు. పారిశుధ్య పనులు, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్, తాగునీటి సరఫరా ట్యాంకులను పరిశీలించారు. ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకులు ప్రతి 15 రోజులకు శుభ్రం చేయాల న్నారు. డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, వైస్ ఎంపీటీసీ తమ్మినాయుడు, క్లస్టర్ కోఆర్డినేటర్ చంద్రకళ పాల్గొన్నారు.

జిందాల్ నిర్వాసితుల ధర్నా



నల్లజెండాలతో ధర్నా చేస్తున్న జిందాల్ నిర్వాసితులు

శృంగవరపుకోట రూరల్, జూలై 11(ఆంధ్ర జ్యోతి): జిందాల్ యాజమాన్యం నుంచి తమకు రావాల్సిన పరిహారం ఇప్పించాలని ఆ కంపెనీ నిర్వాసితులు శుక్రవారం బొడ్డవర గ్రామంలో ధర్నా చేశారు. జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు చల్లా జగన్ ఆధ్వర్యంలో నల్లజెండాలతో నినాదాలు చేశారు. మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ తమ సమస్యపై స్పందించి ప్రభుత్వంతో మాట్లాడాలని వారు కోరారు. అలాగే ఎమ్మెల్యే కూడా తమ సమస్య పై దృష్టి సారించాలని కోరారు.

వాడీవేడిగా రేగిడి మండల సమావేశం

రేగిడి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రేగిడి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాడివేడిగా సాగింది. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ దార అప్పలనరసమ్మ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సభలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌బాబు పాల్గొని, సమస్యలపై అధికారులతో చర్చించారు. ఎరువుల పంపిణీ ఏకపక్ష నిర్ణయాలు, లో వోల్టేజ్ సమస్యలు, అధ్వాన రహదా రులు, 1బీ, అడంగల్ పంపిణీలో జాప్యంపై ఆ శాఖ అధికారులను సభ్యులు కడిగి పారేశారు. వైస్ ఎంపీపీ అచ్చంనాయుడు, కార్యాలయ ఏవో నాగమణి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

విజయనగరం కలెక్టరేట్, జూలై 11(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న రూ.6,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలంటూ ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి కలెక్టర్ కార్యాలయం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ పీజీ విద్యార్థులకు శాపంగా మారినా జీవో నెం.77ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 2022-21, 2021-22, 2022-23 సంవత్సరాల్లో పూర్తి చేసిన విద్యార్థులకు కళాశాలలు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాయని ఆరోపించారు. సంఘ నాయకులు సుమన్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

నిమ్మలపాలెం రోడ్డు సమస్యను పరిష్కరించాలి

కొత్తవలస, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నిమ్మలపాలెంలో రెండు వర్గాల మధ్యనున్న రోడ్డు సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్సీ రఘురాజు సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నిమ్మలపాలెం రోడ్డు విషయం చర్చకు వచ్చింది. అలాగే కస్తూర్బా పాఠశాలలో తరచూ అగ్నిప్రమాదాలు సంభవించడంపై జడ్పీటీసీ నెక్కల శ్రీదేవి ప్రశ్నించారు. ఫైర్ ఆడిట్ జరుగుతోందని విద్యాశాఖ అధికారిణి శ్రీదేవి తెలిపారు. గతంలో భూములకు సంబంధించి జాయింట్ ఎల్‌పీఎం విడగొట్టుకోవడానికి కేవలం రూ.50 మాత్రమే చలానా కట్టేవారని, ఇప్పుడు రూ.550 చెల్లించాలని ఆదేశాలు రావడం వల్ల రైతులకు భారమైందని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని డిప్యూటీ తహసీల్దార్ సునీత తెలిపారు. ఇలా వివిధ సమస్యలను సమావేశంలో ప్రస్తావించారు. ఎంపీడీవో రమణయ్య, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● మరొకరికి గాయాలు

కొత్తవలస, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగళపాలెం గ్రామ జంక్షన్ సమీపంలో గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందగా మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. దీనిపై ఎస్ఐ హేమంత్‌కుమార్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. లక్కవరపుకోట మండలం లచ్చంపేట పంచాయతీ భూమిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన మాదాబత్తుల శ్రీను(23), ధనాలకోటి అప్పలనాయుడు విశాఖ జిల్లా పెందుర్తి నుంచి కొత్తవలస వైపు తమ గ్రామానికి వెళ్లడానికి స్కూటీపై వస్తున్నారు. మంగళపాలెం జంక్షన్ సమీపంలోకి వచ్చేసరికి గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో మాదాబత్తుల శ్రీను అక్కడికక్కడే మృతిచెందాడు. ఇదే ప్రమాదంలో ధనాలకోటి అప్పలనాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం విశాఖపట్టణం తరలించారు. మృతుడు బరోడా బ్యాంకులో కాంట్రాక్టు ప్రాతిపదికన పని చేస్తున్నాడు. అప్పలనాయుడు వేపగుంటలోని జీవీఎంసీలో ఎలక్ట్రికల్ డిపార్టుమెంట్‌లో కాంట్రాక్టు వర్కర్‌గా పనిచేస్తున్నాడు. మృతుడి తండ్రి సత్తిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ షణ్ముఖరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య

విజయనగరం క్రైం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో గల రాజీవ్‌నగర్‌లో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుందని టూటౌన్ ఎస్ఐ కృష్ణమూర్తి శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పూసపాటిరేగ మండలం ఎరుకొండ గ్రామానికి చెందిన సురేష్‌కు నెల్లిమర్ల మండలం టొంపలపేటకు చెందిన బుష్కల మణితో నాలుగేళ్ల కిందట వివాహమైంది. వీరికి రెండేళ్ల పాప ఉంది. భార్యభర్తల మధ్య గొడవలు జరగడంతో పెద్దమ్మ ఎం.ఎర్నిమ్మ వారిని రాజీవ్‌నగర్ కాలనీకి తీసుకువచ్చింది. సురేష్ పెయింటింగ్ పనిచేస్తున్నాడు. అతని వద్ద అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బూర సాయికుమార్‌కు మణితో పరిచయం ఏర్పడింది. దీంతో సాయికుమార్, మణిలు విజయవాడ వెళ్లిపోయారు. అక్కడి నుంచి మణి పెద్దనాన్న వారిద్దరినీ విజయనగరం తీసుకువచ్చారు. ఈక్రమంలో ఈనెల 9న రాజీవ్‌నగర్ కాలనీలోని పెద్దమ్మ ఎర్నిమ్మ ఇంట్లోని బాత్రూంలో మణి గ్లీజర్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీంతో మణి తల్లి సూర్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు పోలీసులు నమోదు చేశారు. తన కుమార్తె మృతికి సాయికుమార్ కారణమని ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కోళ్లఫారం పరిశీలన

మెంటాడ, జూలై 11(ఆంధ్రజ్యోతి): జయతి పంచాయతీ బిరసాడవలస వద్ద విజయనగర్ హేచరీస్ పేరుతో నడుస్తున్న కోళ్లఫారాన్ని అధికారుల బృందం శుక్రవారం పరిశీలించింది. ఈ కోళ్లఫారం వల్ల వాయు, జల కాలుష్యం వ్యాప్తి చెందుతోందని బిరసాడవలస గ్రామస్థులు ఇటీవల ఫిర్యాదులు, ఆందోళనలు చేశారు. ఈనేపథ్యంలో నిజ నిర్ధారణకు వివిధ శాఖలకు చెందిన అధికారులతో కమిటీని ఏర్పాటుచేసిన విషయం తెలిసిందే. ఈ కమిటీ కోళ్లఫారం వద్దకు వెళ్లి పరిశీలించింది. సిబ్బంది, కూలీలతో మాట్లాడారు. తమకు ఎటువంటి కాలుష్య సమస్యలు ఎదురు కాలేదని వారు కమిటీ ఎదుట తెలిపారు. ఉన్నతాధికారులకు నివేదికను అందజేస్తామని విజయనగరం పశు సంవర్ధక శాఖ జేడీ వైవీ రమణ తెలిపారు. ఈ బృందంలో డీపీవో మల్లికార్జునరావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏఈఈ శార్వాణి, వైద్య ఆరోగ్య శాఖ డీఎస్‌వో డా.సత్యనారాయణ, తహసీల్దార్ అరుణకుమారి, ఎస్ఐ సీతారాం ఉన్నారు.

గంజాయి స్వాధీనం

దత్తిరాజేరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్టు పెదమానాపురం ఎస్ఐ ఆర్.జయంతి తెలిపారు. ఆమె స్థానిక విలేకర్లకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం తెల్లవారు జామున మానాపురం సమీపాన స్థానిక పోలీసులు తనిఖీ చేస్తుండగా, రెండు కారుల్లో అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను గుర్తించి, పట్టుకున్నారు. వారి నుంచి సుమారు 200 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రెండు కార్లను సీజ్ చేశారు. మరికొంతమంది పరారీలో ఉన్నారు. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని ఎస్ఐ చెప్పారు.

ప్రజారోగ్యాన్ని గాలికొదిలేస్తున్నారు

విజయనగరం గంటస్తంభం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కొత్తపేటలో ఒక తినుబండారాల ఫ్యాక్టరీని గ్యాస్, ఇతర సామగ్రి ఉపయోగించి నడుపుతున్నారని, ఇది నిబంధనలకు వ్యతిరేకమని సంబంధిత శాఖలకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని జైభీంరావ్ భారత్ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు టొంపల నర్సయ్య, కణిగిరి శ్రీనివాసరావులు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. అధికారులు ఫ్యాక్టరీకి కొమ్ముకాస్తూ, ప్రజారోగ్యాన్ని గాలికొదిలేశారని దుయ్యబట్టారు. ఈ ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికులకు కూడా తగిన వసతులు కల్పించడం లేదని ఆరోపించారు. ఈ సమావేశంలో పార్టీ ప్రతినిధులు చిన్నం అరుణ్‌కుమార్, మరడాన వెంకట నాయుడు, పైల జ్యోతి పాల్గొన్నారు.

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు



సిబ్బంది సమస్యలు వింటున్న ఎస్పీ

విజయనగరం క్రైం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు శాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక ఎస్పీ కార్యాలయంలో పోలీసు వెల్ఫేర్ డే కార్యక్రమాన్ని నిర్వహించి, అధికారులు, సిబ్బంది నుంచి వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు సంక్షేమానికి ప్రాధాన్యత కల్పిస్తామన్నారు.

పదవుల కోసం పనిచేసే నాయకులు వద్దు



నిరసన చేస్తున్న జనసేన నాయకులు

శృంగవరపుకోట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పదవుల కోసం పని చేసిన నాయకులు తమకు వద్దంటూ స్థానిక జనసేన నాయకులు శుక్రవారం ఎస్.కోటలో నిరసన తెలిపారు. నియోజకవర్గ ఇన్‌చార్జి ఒబ్బిన సత్యనారాయణను తొలగించాలని డిమాండ్ చేశారు. సమర్థవంతమైన నాయకుడిని ఇన్‌చార్జిగా నియమించాలన్నారు. అధికారంలో లేనప్పుడు పార్టీ బలంగా ఉండేదని, అధికారంలోకి వచ్చిన తర్వాత బలహీన పడిందని ఆరోపించారు.

వసతిగృహాలపై నిర్లక్ష్యం వీడాలి

శృంగవరపుకోట, జూలై 11(ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతి గృహాలపై పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం మానుకోవాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్.కోటలో దళిత ఉద్యమ నేతలు ఆతవ ఉదయ్ భాస్కర్, గంటాన అప్పారావు, పి.సూరిదేముడు, బోనెల ఈశ్వరావు, గుర్రపు శ్రీను, డోల కేశవ, బోని జీవన్, పత్రి అప్పారావు తదితరులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం లేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. మెనూ చార్జీలు, కాస్మొటిక్ చార్జీలను పెంచాలని కోరారు.

బీఎల్వోలు అందుబాటులో ఉండాలి

గజపతినగరం, జూలై11(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బీఎల్వోలు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఈఆర్వో ప్రమీలగాంధీ అన్నారు. శుక్రవారం స్థానిక బాలాజీ పాలిటెక్నికల్ కళాశాలలో బీఎల్వోలకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో 18 ఏళ్లు నిండినవారికి ఓటు కల్పించే బాధ్యత బీఎల్వోలదే అన్నారు. పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. తహసీల్దార్ బి.రత్నకుమార్, బీఎల్వోలు పాల్గొన్నారు.

ఎక్కడికక్కడే అక్రమ నిల్వలు!

(5వ పేజీ తరువాయి)

చేసే 19.325 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేశారు.

● అదే ఏడాది గరుగుబిల్లి మండలం ఖడ్గవలసలోని ఓ ఎరువుల దుకాణంలో సుమారు రూ.3 లక్షల విలువైన 45 వేల మెట్రిక్ టన్నుల ఎరువులను అధికారులు సీజ్ చేశారు. 2024-25 లోనూ అదే దుకాణంలో 64.3 మెట్రిక్ టన్నులను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు రూ.8 లక్షల వరకూ ఉంటుంది. 2020-21లో కూడా ఆ దుకాణంలో రూ. 6 లక్షల విలువైన 47.62 మెట్రిక్ టన్నుల ఎరువులను అధికారులు సీజ్ చేశారు. మూడుసార్లు అదే దుకా ణంలో అధికారులు దాడులు చేశారంటే.. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

● 2024-25లో భామినిలో ఎరువులు దుకాణంపై అధికారులు దాడులు నిర్వహించి రూ.7.80 లక్షల విలువ చేసే 46.595 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేశారు.

● గత నెల 28న మక్కువ మండలం శంబర గ్రామంలోని ఓ ఎరువుల షాపుపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించిన సంగతి తెలిసిందే. స్టాక్ రిజిస్టర్‌కు, నిల్వలకు మధ్య ఉన్న తేడాలను గుర్తించారు. రూ.28 లక్షల విలువ చేసే 119.9.25 టన్నుల ఎరువులను సీజ్ చేశారు.

● ఇటీవల మక్కువ మండలం సన్యాసిరాజపురం సచివాలయ భవనంలో 285 బస్తాల ఎరువులను అక్రమంగా నిల్వ ఉంచినట్లు అధికారులు తెలుసుకున్నారు. ఈ మేరకు జిల్లా వ్యవ సాయాధికారి రాబర్ట్‌పాల్ ఆధ్వర్యంలో వారు దాడులు చేసి ఆ ఎరువులను సీజ్ చేశారు.

కఠిన చర్యలు తప్పవు

అధిక ధరలకు ఎరువులను విక్రయించినా.. ఎక్కడైనా బ్లాక్ చేసినా కఠిన చర్యలు తప్పవు. జిల్లాలో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయి. వాటి కోసం అన్నదాతలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎరువులను పక్కదారి పట్టించి పక్క రాష్ట్రాలకు తరలించిన వారి సమాచారం తెలియజేస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

-రాబర్ట్‌పాల్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి, పార్వతీపురం మన్యం

సమావేశాన్ని జయప్రదం చేయండి

పాలకొండ, జూలై11 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా తాడేపల్లిలోని సీఎస్ఆర్ కల్యాణ మండపంలో ఈనెల 13న నిర్వహించనున్న ఎస్సీ, ఎస్టీ గజిటెడ్ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర స్థాయి సమావేశాన్ని జయ ప్రదం చేయాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య (ఎంఈఎఫ్) మన్యం జిల్లా అధ్యక్షుడు బోసు మన్మథరావు, సమాఖ్య రాష్ట్ర నాయకులు అలజంగి చిన్నా రావు, సతీష్‌కుమార్ ప్రకటనలో గురువారం తెలిపారు. సమావేశంలో మందకృష్ణ మాదిగ, జ్యోతికృష్ణ తదితరులు పాల్గొంటారన్నారు. భవిష్యత్ కార్యాచరణను మందకృష్ణ మాదిగ వెల్లడిస్తారని తెలిపారు.

పారిశుధ్య పక్షోత్సవాలకు సిద్ధం కావాలి

సీతానగరం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్య పకోత్సవాలు నిర్వహించడానికి పంచాయతీ కార్యదర్శులు సమా యత్తం కావాలని ఎంపీడీవో ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు ఈ నెల 16 నుంచి 30వ తేదీ వరకు గ్రామాల్లో నిర్వహించనున్న పారిశుధ్య పక్షోత్సవాలు నిర్వహణ అంశాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కుమార్‌వర్మ పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పొలిటికల్ సైన్స్, కంప్యూటర్ సబ్జెక్టులను గెస్ట్ లెక్చరర్‌గా బోధిం చడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు ప్రిన్సిపాల్ టి.శ్రీవరం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 15న మంగళవారం సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తులను కార్యాలయంలో అందజేయాల న్నారు. ఈ నెల 16న ఉదయం 10 గంటలకు డెమో, ఇంటర్వ్యూలకు హాజరుకావాల్సి ఉంటుందన్నారు.

మంత్రి పర్యటనను విజయవంతం చేయండి

పార్వతీపురం, జూలై11 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోల బాలవీరాంజనేయస్వామి పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర కోరారు. శుక్రవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. మంత్రి జిల్లా కేంద్రం పార్వతీపురంలో జరిగే తొలి అడుగు కార్య క్రమంలో పాల్గొంటారన్నారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహిస్తారన్నారు.

పారిశుధ్యంపై అవగాహన



ప్రచారం చేస్తున్న అధికారులు

సాలూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 13, 17, 24, 26 వార్డుల్లో పారిశుధ్యంపై శుక్రవారం కమిషనర్ టీవీ ప్రసాద్ అవగాహన కల్పించారు కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణ ప్రజలు తమ చేతులు, ఇంట్లోని బాత్‌రూమ్‌లు, పరిసర ప్రాంతాలను శుభ్రపరచుకోవాలన్నారు. వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం డబ్బీవీధి చెరువు వద్ద మెప్మా మహిళలతో మొక్కలు నాటించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎల్.బాలకృష్ణ పాల్గొన్నారు.

అధ్వానంగా కూరగాయల మార్కెట్



మార్కెట్‌లో పారిశుధ్యం లోపం

రామభద్రపురం, జూలై11 (ఆంధ్రజ్యోతి): రామభద్రపురంలోని కూరగా యల మార్కెట్ అధ్వానంగా ఉంది. వర్షం నీరు బయటకు వెళ్లకపో వడం, కుళ్లిన కూరగాయలు అక్కడే పడవేయడంతో అవి కుళ్లి దుర్వాన వెదజల్లుతోంది. దీంతో కొనుగోలుదారులలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మార్కెట్‌లో పారిశుధ్యానికి ప్రాధాన్యమివ్వాల్సిన అవసరం ఉంది.

మహిళలను అవమానించడం తగదు

మంత్రి గుమ్మిడి సంధ్యారాణి



సాలూరు, జూలై11 (ఆంధ్రజ్యోతి): నిండు సభలో ఒక మహిళను అవమానించిన ఫలితమే 151 నుంచి 11 సీట్లని రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. శుక్రవారం తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జగన్‌రెడ్డి బుద్ధి ఇంకా మారలేదని, సైకోతత్వం ఇంకా ఎక్కువై నీచంగా ప్రవరిస్తున్నారన్నారు. నేడు మరో మహిళను దారుణంగా అవమానపరిచి, రాక్షస ఆనందం పొందారన్నారు. ప్రసన్నకుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు వైసీపీ వాళ్ల ఇంట్లోని ఆడవారికి చూపిస్తే వారు ఏమంటారో చెప్పాలన్నారు. ప్రసన్నకుమార్ రెడ్డిపై జగన్ చర్యలు తీసుకోకపోవడం మహిళలను అవమానించడమేనన్నారు. ప్రశాంతిరెడ్డికి క్షమాపణ చెప్పకపోవడం మీ అహంకారానికి నిదర్శనం కాదా అని ప్రశ్నించారు. వైసీపీ నేతలు రోజుకో హేయమైన పదజాలంతో మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. దీనిపై వైసీపీ అధినేత జగన్ మౌనం మరింత విచారకరమన్నారు. ఇలాంటి వారిని సమాజం నుంచి తరిమేయాలన్నారు. జనావాసాల మధ్య తిరగడానికి అనర్హులన్నారు. ప్రసన్నకుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని సంధ్యారాణి డిమాండ్ చేశారు.

ఇంటింటికీ కుళాయిలు



ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

కొమరాడ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికి తాగునీరు అందివ్వడమే ధ్యేయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. శుక్రవారం ఆర్తం సీతమాంబపురంలో తాగునీటి ట్యాంక్‌ను ఆమె ప్రారంభించారు. తాగునీటి సమస్య పరిష్కరించినందుకు ఈ సందర్భంగా గ్రామస్థులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్య క్రమం నిర్వహించారు. ఇంటింటికీ సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్య క్రమంలో ఎంపిడివో రమేష్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ గౌరునాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు శనపతి ఉదయ్, శేఖర్‌పా త్రుడు, అరకు పార్లమెంట్ రైతు అధ్యక్షుడు దేవకోటి వెంకటనాయుడు పాల్గొన్నారు.

పాఠశాలను కొనసాగించండి

గరుగుబిల్లి, జూలై11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హిక్కింవలసలో ప్రాథమిక పాఠశాలను మళ్లీ కొనసాగించాలని గ్రామస్థులు కోరారు. సమస్యను శుక్రవారం కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీ శ్వరి దృష్టికి స్థానికులతో పాటు బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మఱ్రాపు పురుషోత్తంనాయుడు, మండల కార్యదర్శి వై.శ్రీనివాసరావు తదితరులు తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో 1 నుంచి 5వ తరగతి వరకు పాఠశాల నిర్వహించేవారని, ప్రస్తుతం గ్రామంలో 1, 2 తరగతులకే పరిమితమయ్యాయన్నారు. 3 నుంచి 5 తరగతులను గ్రామానికి దూరంలోని హైస్కూల్‌లో విలీనం చేశారన్నారు. ఇక్కడ 3 నుంచి 5 తరగతులకు సంబంధించి సుమారు 48 మంది వరకు ఉన్నారన్నారు. అయితే ఎమ్మార్సీకి ఆనుకుని ఉన్న పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నా మోడల్ ప్రైమరీ పాఠశాలగా ఎంపిక చేశారన్నారు. హిక్కింవలసలో అలందుకు తగ్గట్టు విద్యార్థుల సంఖ్య ఉన్నా మంజూరు చేయక పోవడంపై ఆవేదన వెలిబుచ్చారు. గ్రామానికి ఆనుకుని ఉన్న పాఠశాలను మోడల్ ప్రైమరీ గా ఎంపిక చేస్తే పాఠశాలకు పంపిస్తామని, లేదంటే పంపించ మని ఖరాఖండిగా చెప్పారు. పాఠశాల సమస్యను మూడు పర్యాయా లుగా మన్యం కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లామని గ్రామానికి చెందిన పాతిన పోలీస్, తిరుపతి, ఎస్ఎంసీ ఛైర్మన్ కె.భవాని తెలిపారు. పాఠశాల కేటాయించేంతవరకు తమ పిల్లలను పాఠశాలకు పంపించమని ఏకగ్రీవంగా తీర్మానించామన్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్తానన్నారు.

రోడ్డుకు మరమ్మతులు



కోటవానివలసలో రహదారి పనుల దృశ్యం

గరుగుబిల్లి, జూలై11 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం జిల్లా కేంద్రం సమీపంలోని కొత్తవలస నుంచి కోటవానివలస రోడ్డుకు సంబంధిత అధికారులు ఎట్టకేలకు మరమ్మతులు చేపట్టారు. ఈ రోడ్డు ప్రమాదభరితం ఉందని, వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారంటూ ఈ నెల 7న 'ఆంధ్రజ్యోతి'లో రహదారుణాలు శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆర్అండ్‌బీ అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా జేఈ వాసిరెడ్డి రామ్మోహనరావు మాట్లాడుతూ అడ్డాపుశీల నుంచి కొత్తవలస వరకు రహదారి మరమ్మతులకు రూ. 40 లక్షలు నిధులు మంజూర య్యాయన్నారు. బీటీ రహదారి నిర్మాణం చేపడతామని చెప్పారు.

ఘనంగా ఈయూ ఆవిర్భావ దినోత్సవం

పార్వతీపురం టౌన్, జూలై11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట శుక్రవారం ఎంప్లాయిస్ యూనియన్ 74వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈయూ జిల్లా అధ్యక్షుడు ఎం. శ్రీనివాసరావు ఎంప్లాయిస్ యూనియన్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మిక, శ్రామిక వర్గం కోసం ఈయూ నిరంతరం శ్రమిస్తోందన్నారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి కె.నర్సింగరావు, అధ్యక్షుడు డి.ఎ.నాయుడు పాల్గొన్నారు.

●పాలకొండ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో శుక్రవారం యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బి.కె.మూర్తి, ఎల్.డి.నాయుడు, ఎం.వి.సాగర్, వారాడ వెంకటరమణ పాల్గొన్నారు.

ఉపాధి కార్యాలయానికి కొబ్బరి మొక్కలు

భామిని, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కార్యాలయానికి శుక్రవారం 1032 కొబ్బరి మొక్కలు చేరాయని ఏపీవో బాబూరావు తెలిపారు. వాటిని రైతులకు అందజేయనున్నామన్నారు. పంచాయతీల వారీగా తరలించిన కొబ్బరి మొక్కలు వెంటనే నాటేందుకు ఎఫ్ఏలు, మేట్లు బాధ్యత తీసుకోవాలని సూచించారు. రైతులకు చెరువు గట్లపై నాటేందుకు ఇంఆకా 8272 మొక్కలు అందజేస్తామని ఏపీవో వివరించారు.

18ఎల్ కాలువ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

సీతానగరం, జూలై11 (ఆంధ్రజ్యోతి): గుమ్మడివరంలోని 18ఎల్ వెంగళరాయసాగర్ కాలువ పనులను పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర శుక్రవారం పరిశీలించారు. 18ఎల్ కాలువ పనులు, డిస్ట్రిబ్యూటరీ కాలువలో పూడికతీతలను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో పనులు వేగవంతం చేయాలని ఇరిగేషన్ డీఈఈ పి.నారాయణరావుకు సూచించారు. అలాగే సీతానగరం ఆనకట్ట పనులపై ఆరా తీసి త్వరగా పనులు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ వెంగళరాయసాగర్, సీతానగరం ఆనకట్ట, పెదంకలాం ఆనకట్ట పరిధిలో సుమారు 17 వేల ఎకరాల సాగుభూమి ఉన్నప్పటికీ గత వైసీపీ ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరందించాలని కాలువ పూడికతీత పనులను చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఎరువుల కొరత లేకుండా చూడండి



మాట్లాడుతున్న తహసీల్దార్

బలిజిపేట, జూలై11 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో రైతులు యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సభ్యులు అధికారులను కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గుడివాడ నాగమణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వరినాట్లు, ఎరువుల కొరత కారణంగా మండల వైస్ ఎంపీపీ వెలితి సాయిరాం అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పొలం పనుల్లో బిజీగా ఉన్న రైతాంగం ఎరువుల కోసం ఎరువుల దుకాణశాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంద న్నారు. వ్యవసాయశాఖాధికారి శివగణేష్ మాట్లాడుతూ యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని నారాయణపురం ఎంపీటీసీ సభ్యుడు అలజంగి రాజమోహన్ అధికారులను కోరారు. అనంతరం నిత్యావసర సరుకుల పంపిణీ, భూముల రీసర్వేపై తహసీల్దార్ బాలమురళీకృష్ణ మాట్లాడారు. సమావేశంలో ఎంపీడీవో, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

యువతతోనే దేశాభివృద్ధి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్యాంబాబు

పాలకొండ, జూలై11 (ఆంధ్రజ్యోతి): దేశం అభివృద్ధి యువతపై ఆధారపడి ఉంటుందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్యాంబాబు అన్నారు. శుక్రవారం కళాశాలకు చెందిన అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జనాభాతో పాటు సుస్థిరత, పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్యం వంటి అంశాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, గోడపత్రికల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అర్థశాస్త్ర విభాగాధిపతి ఎం.శాంతి, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ బి.రాజు తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌గా కళావతి ప్రమాణ స్వీకారం

కురుపాం,జూలై11(ఆంధ్రజ్యోతి): కురుపాం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కడ్రక కళావతి శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఏఎంసీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, టీడీపీ రాష్ట్ర కార్యద ర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బంది సమస్యలు పరిష్కరిస్తాం: ఎస్పీ



వినతులను స్వీకరిస్తున్న ఎస్పీ

బెలగాం, జూలై11 (ఆంధ్రజ్యోతి): పోలీస్ సిబ్బంది సమస్యలు పరిష్కరించి, వారి సంక్షేమానికి కృషి చేస్తామని ఎస్పీ ఎస్.వి.మాధవరెడ్డి అన్నారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో పోలీస్ గ్రీవెన్స్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలీసుల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి, డీసీఆర్‌బీ సీఐ ఆదాం తదితరులు పాల్గొన్నారు.

300 లీటర్ల సారాతో ఇద్దరు అరెస్టు

కురుపాం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జియ్యమ్మవలస మండలంలోని దాసరిపేట సమీపం వట్టిగెడ్డ రిజర్వాయర్ కాలువ గట్టు వద్ద కురుపాం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావు సిబ్బందితో తనిఖీలు చేస్తుండగా కారులో తరలిస్తున్న 300 లీటర్ల సారా పట్టుబడింది. సారా రవాణా చేస్తున్న పాలకొండ మండలం చిన్నమంగళాపురానికి చెందిన కారు డ్రైవర్ వడ్డాది సురేష్, జియ్యమ్మవలస మండలం చినమొరంగి చెందిన బొత్స అనీల్ కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 20 ప్లాస్టిక్ క్యాన్లలో 300 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. సారాను సరఫరా చేసిన రాయగడ జిల్లా సందుబడి గ్రామానికి చెందిన రత్నాల మాధవ్, వంగర మండలం కోదులగుమ్మడ గ్రామానికి చెందిన బొచ్చ బలరాం, చినమేరంగికి చెందిన మీసాల శ్రీకాంత్, సిరిపురపు అశోక్, సిరిపురపు కళావతిలపై కేసు నమోదు చేశారు. కారు యజమాని కొమరాడ మండలం గంగిరేగువలస గ్రామానికి చెందిన సింహాచలంపై కూడా కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

రైలులో పోలీసుల తనిఖీలు



డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ దృశ్యం

బెలగాం, జూలై11 (ఆంధ్రజ్యోతి) : పార్వతీపురం రైల్వే స్టేషన్‌లో శుక్రవారం పోలీసులు రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైలులో పోలీసులు, ఈగల్ టీం, రైల్వే పోలీసులు, డాగ్ స్క్వాడ్ బృందంతో తనిఖీ చేశారు. విజయనగరం వరకు తనీఖీలు చేశారు. పక్క రాష్ట్రం ఒడిశా నుంచి గంజాయి వంటి మాదకద్రవ్యాలు అక్రమ రవాణా అరికట్టేందుకు తనిఖీలు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీతానగరం ఎస్ఐ రాజేష్, రైల్వే పోలీసులు పాల్గొన్నారు.

చెరువుల ఆక్రమణలపై దృష్టిసారించాలి

పార్వతీపురం టౌన్, జూలై11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెరువుల ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్లానింగ్ అధికారులను మున్సిపల్ కమిషనర్ సీహెచ్.వెంకటేశ్వర్లు ఆదేశించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రణాళిక విభాగం అధికారి వెంకట నారాయణ, సచివాల యాల ప్లానింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. రెవెన్యూ, మున్సిపల్ మాస్టర్ ప్లానింగ్ నిబంధనలకు వ్యతిరేకంగా చెరువు గట్లపై ఉన్న అక్రమ కట్టడాలపై పూర్తిస్థాయిలో వివరాలు సేకరించాలన్నారు. రెండు వారాల్లోగా నివేదికను అందజేయాలన్నారు. అనుమతులు లేకుండా నిర్మాణా లు జరిగితే వెంటనే సంబంధిత యజమానులపై చర్యలు తీసుకో వాల న్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాణిజ్య సముదాయాల నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయరాదని స్పష్టం చేశారు.

పాఠశాలపై చర్యలు తీసుకోండి

మక్కువ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మక్కువలోని విశ్వభారతి పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.హరికృష్ణ, అన్నారు. స్థానిక ఎంఆర్‌సి భవనంలో మండల విద్యాశాఖాధికారి శ్యామసుందరరావు శుక్రవారం వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 25 శాతం పేదల విద్యార్థులకు ఉచిత సీట్లు కేటాయించాలనే హైకోర్టు ఆదేశాలను యాజమాన్యం విస్మరించింద న్నారు. బస్సులు ఫిట్‌నెస్, అధిక ధరలకు పుస్తకాలు అమ్ముతున్నారని ఆరోప ణలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు నవీన్, శేఖర్, కార్తీక్ పాల్గొన్నారు.

రీసర్వే తప్పులను సరిదిద్దుతాం

కొమరాడ, జూలై11 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం చేపట్టిన రీసర్వే ప్రక్రియలో భూ రికార్డులు తప్పులు ఉన్నట్టు ఫిర్యాదు చేస్తే 15 రోజుల్లో సమస్యను పరిష్కరిస్తాని కొమరాడ తహసీల్దార్ సి.హెచ్.సత్యనారాయణ హామీ ఇచ్చారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శెట్టి శ్యామల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలో గత మూడు నెలలు జరిగిన అభివృద్ధి పురోగతిపై సమీక్ష వివిధ శాఖల వారీగా చేశారు. ముందుగా వ్యవసాయ శాఖాధికారి ప్రసాద్ ఇప్పటివరకు రైతులకు అందించిన విత్తనాలు, ఎరువులు వివరాలను తెలిపారు. ఇప్పటివరకు యూరియా, పొటాష్ ప్రభుత్వం ద్వారా పంపిణీ కాలేదని తోడుము సర్పంచ్ వై.సింహాచలం నాయుడు ఆరోపించారు. ఎరువును ప్రభుత్వం రాయితీపై ఇవ్వకపోవడంతో రైతులకు ఆర్థికంగా భారం అవుతోందన్నారు. పలు సమస్యలపై సర్పంచ్‌లు, అధికారులను నిలదీశారు. జంఝావతి ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారి వేణుగోపాల నాయుడు మాట్లాడుతూ ఎత్తిపోతల పథకం ద్వారా ఇరిగేషన్ ద్వారా నీటిని ఈ నెల 18న విడుదల చేస్తామన్నారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యురాలు డి.లక్ష్మి, ఎంపీడీవో ఎస్.రమేష్, వైస్ ఎంపీపీ ఎన్.శరత్‌బాబు పాల్గొన్నారు.

వనబాట వీడి.. జనబాట పట్టండి

రాయగడ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): వనబాట వీడి జనబాట పట్టాలని మావోయిస్టులకు రాయగడ ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ పోస్టర్లతో పిలుపునిచ్చారు. వారిని జనజీవలన స్రవంతిలోకి ఆహ్వానిస్తూ పలు ప్రాంతాలలో పోస్టర్లు అతికించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలు చంద్రపూర్, సమితి హనుమంతపూర్, సీతాగుడి, మునిగుడ బస్ స్టాండ్, రైల్వే స్టేషన్, ఖంబేసి, నేలగిరి కొండ ప్రాంతాలలో వారిని జనజీవన స్రవంతిలో కలవాలని పోస్టర్లు అతికించి విజ్ఞప్తి చేశారు. ప్రజా జీవితంలోకి వచ్చేందుకు సిద్ధపడిన మావోయిస్టులకు ప్రభుత్వం నుంచి రూ.50 వేల వరకు నగదు, ఇల్లు కట్టుకోవడానికి ప్రభుత్వ భూమి, వారి పేరుమీద బ్యాంకులో రూ.రెండు లక్షల రూపాయల డిపాజిట్, వివాహానికి రూ.25 వేలు ఆర్థికసాయం చేస్తామని ప్రకటించారు.

ఒడిశా

వ్యాసరచన పోటీలు

రాయగడ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): :స్థానిక సాంస్కృత భవన్‌లో 78వ స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం ఒడియా సాహిత్య అకాడమీ విద్యార్థులకు జిల్లాస్థాయి పోటీలను నిర్వహించింది. జిల్లా సాంస్కృతిక శాఖాధికారి సుష్మిత బౌరి అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఒడియా సాహిత్యం, కవితా పఠనం, వ్యాసరచన, సాధారణ జ్ఞానం, ఆంగ్లభాష అనే నాలుగు అంశాలలో పోటీలు నిర్వహించారు. 6, 7 తరగతుల విద్యార్థులకు జూనియర్ విభాగంలో, 7 నుంచి 10 వ తరగతి విద్యార్థులకు సీనియర్ విభాగంలో ఈ పోటీలు జరిగాయి. విజేతలకు అదనపు కలెక్టర్ నవీన్‌చంద్ర నాయక్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీఈవో రామచంద్ర నహక్, డీఐపీఆర్‌వో బసంతకుమార్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.